క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు



ముడుపుల పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహ స్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో భక్తులు ఘనంగా ముడుపుల పూజలు గురువారం నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న ముడుపుల పూజల్లో భాగంగా వందలాది కిలోమీటర్ల దూరం నుంచి వాహనాలతో భక్తులు వచ్చి పాల్గొంటున్నారు. పూజల అనంతరం భక్తులందరికీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

యోగా దినచర్యగా చేసుకోవాలి



విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న బ్రహ్మకుమారీస్

బలిజిపేట: విద్యార్థి దశనుంచి యోగాను దినచర్యగా చేసుకోవాలని బ్రహ్మకుమారీస్ విశ్వ విద్యాలయం బొబ్బిలి శాఖ ప్రతినిధి బీకే రాజేశ్వరి అన్నారు. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పెదపెంకి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు మాట్లాడుతూ యోగా జీవితంలో దినచర్య కావాలని సూచించారు, యోగాతోనే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. యోగాను ఏవిధంగా అభ్యసించాలో యోగా ఉపాధ్యాయురాలు పి.నళిని ఆసనాలను వేసి చూపించి విద్యార్థులచేత చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావు, సంస్థ ప్రతినిధి రాజేశ్వరి, ఈర్ల సంజీవినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీటిని అందించండి



కోరి గ్రామంలో కుళాయి వద్ద తీసిన గుంతలో చేరిన మురుగునీరు

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే కుళాయిల పైపులు కాలువల్లో నుంచి ఏర్పాటు చేయడంతో కుళాయిల ద్వారా వచ్చే నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో పైపులు మరమ్మతుల నిమిత్తం తీసిన గుంతలు పూడ్చకపోవడంతో ఆ గుంతల్లో మురుగునీరు చేరి కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. కాలువల నుంచి ఉన్న పైపులను మార్చాలని, కుళాయిల వద్ద గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

ఏజెన్సీలోమౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం సహాయ కార్యదర్శి కె.రామస్వామి

పార్వతీపురం రూరల్/పార్వతీపురం: యోగాసనాలే కాదు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరతపై దృష్టి సారించాలని ఆదివాసీ గిరిజన సంఘం సహాయ కార్యదర్శి కె.రామస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ జిల్లాలో అనేక గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు కొరతతో పాటు కొన్ని గ్రామాలకు రోడ్లు మంజూరైనా అటవీశాఖాధికారుల ఆటంకాలతో నిలిచిపోయాయన్నారు. ఈ క్రమంలో గిరిజనులకు డోలీకష్టాలు తప్పడం లేదన్నారు. ప్రధానంగా పార్వతీపురం మండలంలోని పలు గిరిజన పంచాయతీల్లో ఉన్న గిరిజన గ్రామాలు రోడ్డు సౌకర్యం లేక అనేక విధాలుగా అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నా జిల్లా యంత్రాంగం పట్టించుకోకుండా ఉద్యోగులను యోగాసనాల పేరుతో కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారే తప్ప సమస్యల పరిష్కారానికి దృష్టిసారించేందుకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. యోగాంధ్ర పేరుతో కాలక్షేపం చేయకుండా సమస్యలపై దృష్టిసారించాలని కోరారు.

రేకుల షెడ్డులో పాఠశాల..!

- దీనస్థితిలో మోడల్ ప్రైమరీ పాఠశాల
- 52మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులకు నిలువనీడ కరువు?

మక్కువ: మింగడానికి మెతుకులు లేవుకానీ, మీసానికి సంగినూనె? అన్నట్లు మక్కువ మండలంలోని కె.పెద్దవలస పాఠశాల పరిస్థితి నెలకొంది. పాఠశాలలో గతేడాది ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహించేవారు. ఈఏడాది కె.పెద్దవలస పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ప్రభుత్వం గుర్తించడంతో, మరో లాంగ్వేజ్ పండిట్ పోస్టును మంజూరుచేశారు. పాఠశాలలో 52మంది విద్యార్థులతో పాటు, నలుగురు ఉపాధ్యాయులు బిక్కు బిక్కు మంటూ ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. పాఠశాలలో 52మంది విద్యార్థులు 1వతరగతి నుంచి 5వతరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలకు భవనం లేకపోవడంతో, గ్రామస్తులు చందాలతో నిర్మించుకున్న రేకులషెడ్‌లో విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలను బోధించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షం కురిస్తే, విద్యార్థులు, ఉపాధ్యాయులు తడిచి ముద్దవ్వాల్సిన పరిస్థితి దాపురించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన పాఠశాలలు నిర్మించేందుకు, నాడు, నేడు ఫేజ్–2లో మక్కువ మండలం, మార్కొండపుట్టి పంచాయతీ, కె.పెద్దవలస పాఠశాల భవనాల నిర్మాణానికి సుమారు రూ.37లక్షలు అప్పటి గిరిజన శాఖమంత్రి, డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర చొరవతో ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. సుమారు రూ.10లక్షలతో పునాదులు, పిల్లర్ల అభివృద్ధి పనులు చేపట్టారు. అంతేకాకుండా పాఠశాల భవనం పనులు త్వరితగతిన జరిపించాలన్న ఉద్దేశంతో అదనంగా ప్రత్యేక నిధులు(స్పెషల్‌గ్రాంట్) సుమారు మరో రూ.10లక్షలు ప్రత్యేక చొరవతో రాజన్నదొర తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకోడ్ రావడంతో టెండర్ ప్రక్రియ జరగక నిధుల మంజూరులో జాప్యం నెలకొంది. ఏడాది క్రితం రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోకుండా ఆ పాఠశాలలను అలాగే వదిలేసింది.



గ్రామస్తులు నిర్మించుకున్న రేకులషెడ్ ఇదే



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పునాదులు, పిల్లర్లు నిర్మించిన దృశ్యం

రేకులషెడ్‌లోనే విద్యాబుద్ధులు

గ్రామస్తులమంతా చందాలు పోగుచేసి నిర్మించుకున్న రేకులషెడ్‌లోనే పిల్లలకు, ఉపాధ్యాయులు చదువులు చెబుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిధులు మంజూరుచేసి, కొంతమేరకు పనులు జరిపించినా, మిగిలిన పనులు జరగలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నాయకులు, అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణాలు పూర్తిచేయాలి.

యు.నాగరాజు, విద్యార్థిని తండ్రి, కె.పెద్దవలస

విదేశీ అతిథులు వచ్చాయోచ్..!



చెల్లన్నాయుడువలసలో చింతచెట్లపై స్థావరం ఏర్పాటు చేసుకున్న సైబీరియా పక్షులు

సీతానగరం: మండలంలోని చెల్లంనాయుడువలస గ్రామస్తులు ఎదురుచూస్తున్న విదేశీ అతిథులు గ్రామానికి చేరుకోవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెల్లన్నాయుడువలస గ్రామానికి ఏటా వచ్చే సైబీరియా(విదేశీ అతిథులు) పక్షులు సువర్ణముఖి నది ఒడ్డునున్న చింత చెట్లపై స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గడిచిన ఏడాది విదేశీ అతిథులు రాకపోవడంతో దిగాలు పడిన ప్రజలకు ఈ ఏడాది అనుకున్న సమయానికి అవి రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విదేశీ అతిథులు ఉభాలు చేసి వరిచేను కోతలు ఆరంభమైన కార్తీకమాసంలో పౌర్ణమి రోజున ఇక్కడి నుంచి తిరుగు పయనమవుతాయి. సైబీరియా పక్షులు రావడం వల్ల పంటలు బాగా పండుతాయని, అవి ,గ్రామానికి రక్షణగా ఉంటాయని నమ్మకంతో ఉన్న ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శులు ఆధార్ సీడింగ్ పూర్తిచేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ

సీతానగరం: మండలంలోని గృహాలకు, ఇంటియ జమానుల ఆధార్ నంబర్ అనుసంధానం (ఆదార్ సీడింగ్) పనులను పంచాయతీ కార్యదర్శులు పూర్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ ఆఫీస్‌లో గురువారం యోగాంధ్ర సన్నాహాలతో పాటు ఆధార్ సీడింగ్, ఇంటిపన్నుల వసూలు, గృహాల సర్వే పనులపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ సీడింగ్, ఇంటి పన్నుల వసూలును స్వర్ణ పంచాయతీ యాప్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు, కాలువల్లో జరుగుతున్న సిల్ట్‌తీత సమయాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు సరఫరాపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కలెక్టర్ సూచనల మేరకు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్య వేక్షిస్తారని తెలియ జేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

చెత్తనుంచి సంపద తయారు చేయాలి



కుండీల్లో ఎరువు తయారీని పరిశీలిస్తున్న గ్రామ పంచాయతీ జిల్లా అధికారి కొండలరావు

సీతానరం: మండలంలోని గ్రామాల్లో నిర్మించిన చెత్త శుద్ధి కేంద్రాల్లో గ్రామాల నుంచి సేకరించిన చెత్త నుంచి సంపద తయారు చేయాలని గ్రామపంచాయతీ జిల్లా అధికారి కొండలరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో చెత్తనుంచి సంపద తయారీని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణం చేసిన ఎస్‌డబ్ల్యూపీసీల్లో సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేయడానికి వనరులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు సమకూర్చుకునేందుకు చెత్తనుంచి సంపద తయారు చేయాల్సిన అవసరం ఉదన్నారు.పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో ఎరువుల తయారీకి అవసరమైన ముడి సరుకు సేకరంచాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జె. తేరేజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డున పడిన బతుకు బండి



నిత్యావసర సరుకుల రవాణాకు వినియోగిస్తున్న ఎండీయూ వాహనం

పార్వతీపురం రూరల్: రేషన్ సరుకులను ఇళ్లవద్దకే పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను, సరఫరాకు సిబ్బందిని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు ఇళ్లవద్దకే రేషన్ సరుకులు సరఫరా జరగడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేసే సిబ్బందికి ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇటీవల ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా నిలిపివేసి పేదలను రోడ్డుకు లాగడమే కాకుండా సరఫరా చేసే సిబ్బందిని రోడ్డున పడేసింది. ఈ నేపథ్యంలో ఓ ఎండీయూ వాహనం డ్రైవర్ తన కుటుంబాన్ని పోషించుకునేందుకు, వాహనానికి సంబంధించి వాయిదాలు కట్టుకునేందుకు ఎండీయూ వాహనంలో కిరాణా షాపులకు సరుకులు రవాణా చేసేందుకు ఈ విధంగా వినియోగిస్తున్నాడు.

మధ్యాహ్న కార్మికులకు వెంటనే పని ఇవ్వాలి



డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: అరసాడ హైస్కూల్‌లో తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులకు హైకోర్టు ఆర్డర్ –కలెక్టర్ లీగల్ సెల్ ఆర్డర్ ప్రకారం వెంటనే పని ఇవ్వాలని సీఐటీయూ జిల్లాప్రధాన కారయదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరసాడ హైస్కూల్‌లో 24సంవత్సరాలు పనిచేసిన మధ్యాహ్న భోజన కార్మికులను..చట్టానికి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ కక్షలతో తొలగించారన్నారు. రాజ్యాంగం, ప్రభుత్వ చట్టాల ప్రకారం వారిని పనిలోకి తీసుకోవాలని ఆదేశించినా వారికి పని ఇవ్వకుండా రాజకీయ బెదిరింపులకు పూనుకుంటూ అన్యాయం చేస్తున్నారన్నారు. తొలగించిన కార్మికులకు కోర్టు ఆర్డర్ ప్రకారం వెంటనే పని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, బాధితులు గొడవ చినపార్వతి అరసాడ ఈశ్వరమ్మ, అప్పిశెటి పాల్గొన్నారు.

పెంచిన పనిగంటల భారాన్ని తగ్గించాలి



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

పార్వతీపురం: ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిగంటల భారాన్ని ప్రభుత్వం తగ్గించాలని ఏడబ్ల్యూఎఫ్ పార్వతీపురం డిపో కార్యదర్శి ఏఎస్ తాతబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో గేటు బయట నిరసన తెలపగా ఇందుకు సీఐటీయూ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి తాతబాబు మాట్లాడుతూ కార్మికుల పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచడం సరికాదన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, 1/2019 సర్క్యులర్‌ను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 70లో ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయాలని, కొత్త బస్సులను కొనుగోలు చేసి డ్రైవర్, కండక్టర్లను భర్తీ చేయాలన్నారు. మహిళలకు నైట్‌షిఫ్ట్ డ్యూటీలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై. మన్మథరావు మాట్లాడుతూ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠోరంగా వ్యవహరిస్తోందన్నారు.

ఇటికవలస బీటీ రోడ్డు పూర్తయ్యేదెన్నడు?



రాళ్లతో నెరిపి వదిలేసిన ఇటికవలస రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని మావుడి పంచాయతీ ఇటిక వలస గ్రామానికి రూ.75లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర నిధులు మంజూరు చేశారు. గత ఏడాది ఎన్నికల ముందు మార్చి 3వ తేదీన బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అయితే రోడ్డు పనులు వెంటనే ప్రారంభించినప్పటికీ ఎన్నికలు రావడంతో పనులు మధ్యలో ఆగిపోయాయి. ఆ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా జరిగిన సగం రోడ్డు పనులతో కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికీ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో తమకు రోడ్డు నిర్మాణం పూర్తయిన ఆనందం ఎప్పుడు కలుగుతుందోనని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకోవద్దు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్సై వెంకటరమణమూర్తి, ఈగల్‌సెల్ బృందం సభ్యులు, విద్యార్థులు

- ఎస్సై వెంకటరమణమూర్తి

మక్కువ: మాదకద్రవ్యాలకు అలవాటుపడి, విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై వెంకటరమణమూర్తి, ఈగల్‌సెల్ జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణమోహన్‌లు కోరారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై జిల్లా పోలీస్‌శాఖ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటరమణమూర్తి మాట్లాడుతూ వ్యవసనాలకు బానిసైతే, మీతోపాటు, మీకుటుంబాలు రోడ్డున పడతాయని చెప్పారు. గంజాయి, సిగరెట్లు, మద్యం, గుట్కాలు వంటివి ఉపయోగించడం వల్ల ఆరోగ్యం పాడవడంతో పాటు, మీలో చెడు ప్రవర్తన కలిగిస్తాయన్నారు. మత్తులో చేసే తప్పులు వల్ల జైలుపాలయ్యే అవకాశముంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచేందుకు ప్రయత్నించాలని హితవు పలికారు. అనంతరం ఈగల్‌సెల్ జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం టోల్‌ఫ్రీ నంబర్ 1972కు తెలపాలని కోరారు. అనంతరం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వాల్‌పోస్టర్‌ను విడుదలచేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యపై చర్యలు తీసుకోవాలి

- పుస్తకాలు, యూనిఫాం పేరుతో వేలాది రూపాయల లూటీ



శ్రీచైతన్య పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



పుస్తకాలు నిల్వ ఉన్న గదికి తాళం వేస్తున్న డీఈఓ కార్యాలయం సూపరింటెండెంట్ రంగాచారి

పార్వతీపురం:

శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలకు వెళ్లి విక్రయాలకు సిద్ధం చేసిన పుస్తకాలు, యూనిఫాం సామగ్రిని బయటపెట్టి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అక్రమ అడ్మిషన్ల పేరుతో విద్యార్థులను నిలువెల్లా మోసం చేశారన్నారు. ప్రస్తుతం పుస్తకాలు, యూనిఫాం, బిల్డింగ్ ఫీజు తదితర ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. కళ్లముందే ఈ తతంగమంతా జరుగుతున్నా విద్యాశాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుపుతూ తల్లిదండ్రుల నుంచి వేలల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల దాడులకు సంబంధించిన సమాచారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందడంతో డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ రంగాచారి శ్రీ చైతన్య పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం విక్రయాలకు సిద్ధంగా ఉన్న పుస్తకాల గదికి తాళం వేసి విక్రయాలు నిలుపుదల చేశారు. ఈ ఆందోళనలో ఏఎస్ఎఫ్ నాయకులు నాగభూషణం పాల్గొన్నారు.

గురుకులంలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

సీతానగరం:

మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2025–26 సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ నిమిత్తం 6,7,8 తరగతులతో పాటు 9వ తరగతి బాలికల నుంచి దరఖాస్తులు ఈనెల 23లోగా స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు ఒకప్రకటనలో తెలిపారు. అలాగే బాలురకు సంబంధించి 2025–26 విద్యాసంవత్సరానికిగాను 6,7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ జరుగుతోందన్నారు. దరఖాస్తు చేయడానికి ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, తప్పనిసరిగా దరఖాస్తుతో పొందు పర్చాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 25న కొప్పెర్ల, నెల్లిమర్ల, గురుకులాల్లో పరీక్ష నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 27న ఇంటర్మీడియట్ విద్యార్థులు కాలేజీకి వచ్చి సంప్రదించాలని కోరారు.

నిరుపయోగంగా సచివాలయ భవనాలు



గంగాపురంలో వినియోగానికి నోచుకోని నూతన సచివాలయ భవనం



జగనన్న కాలనీ సమీపంలో నిర్మాణం పూర్తయి నిరుపయోగంగా ఉన్న కృష్ణపల్లి సచివాలయ భవనం



నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకోని నర్సిపురం సచివాలయ భవనం



ప్రారంభానికి నోచుకోని పెదబొండపల్లి రైతు భరోసా కేంద్రం

పార్వతీపురం రూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రజల చెంతకే పౌర సేవలను తీసుకువెళ్లేందుకు ఏర్పాటు చేసి, గ్రామ స్వరాజ్యం కలను నిజం చేసే సచివాలయాల కోసం నాటి సర్కారు పక్కా భవనా లను నిర్మించింది. కూటమి ప్రభుత్వంలో ఇప్పుడా వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. లక్షలు వెచ్చించి నూతన భవనాలను గత ప్రభుత్వం నిర్మించి సచివాలయ వ్యవస్థ ద్వారా ఆ పరిధిలో ఉన్న ప్రజలకు దాదాపు 544 ప్రభుత్వ సేవలను అందించే కార్యక్రమానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టి సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన నిర్వహించింది. అయితే ప్రస్తుతం కుటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే సేవలందించే పాలనకు అడ్డుకట్ట వేసి పేదలను రోడ్డుమీదికి లాగే పరిస్థితికి తీసుకువచ్చింది. ప్రజల వద్దకే పాలనను అందించే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను పటిష్టం చేస్తూ సేవలందించేందుకు పలుచోట్ల నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్ర భవనాలు నేటికీ నిరుపయోగంగా గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. లక్షలు విలువ చేసే భవనాలను ప్రస్తుత ప్రభుత్వం నిరుపయోగంగా ఉంచడం పట్ల ఆ ప్రాంతాల్లో ఉన్న గ్రామీణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విలువైన ప్రభుత్వ భవనాలను వాడుకలోకి తెచ్చి ప్రభుత్వపరమైన సేవలను ప్రజలకు చేరువ చేయాలని కోరుతున్నారు.